



# కలియుగే ప్రథమపాదే...

## పులిపాక వెంకట రమణ



జూబిలీ హిల్స్.

"ది శ్వాంకీ ఏరియా ఆఫ్ హైదరాబాద్."

హైదరాబాద్ నగరంలో, ఆ మాట కొస్తే, ఆంధ్ర రాష్ట్రంలోనే సంపన్ను లందరికీ, కనీసం ఒక ఇల్లన్నా ఉండి తీరే సుందర ప్రదేశ మది.

ఉదయం ఆరు గంటల సమయం. డిసెంబరు నెల. ఇంకా చీకటి తెరలు వీడలేదు. అలాంటి సమయంలో, జూబిలీ హిల్స్‌లో, ఒక ఎత్తైన ప్రదేశంలో, ఒక అందమైన మహల్ లాంటి భవనంలో "హేం గోవర్ పెగ్" గుటక వేస్తున్నాడు లాయర్ విశ్వనాథ్; "ఆజారే పరదేశీ...." 'మధుమతి'లో లత మంగేష్కర్ పాట మృదుమధురంగా వినిపిస్తోంది టేప్‌లో.

ఇది మామూలే. ముందు రోజు పీకల దాకా బిగించేయటం, మర్నాడు తెల్లవారు జామున లేచి, "హేంగ్ ఓవర్ - పెగ్"తో దినచర్య ప్రారంభించటం లాయర్ విశ్వనాథ్ బలహీనత!

లాయర్ విశ్వనాథ్ అంటే, ఆషామాషీ లాయర్ కాదు! ఆంధ్ర రాష్ట్రంలో వేళ్ల మీద లెక్కించదగిన మంచి క్రిమినల్ లాయర్స్‌లో అతనొకడు.

"ఆజారే పరదేశీ..." అయిపోయింది. "చౌధవీకా చాంద్ హొ...." హృద్యంగా వినిపిస్తోంది.

అటూ, ఇటూ పచార్లు చేస్తూ స్కాచ్ విస్కీ స్టైల్‌గా సిప్ చేస్తూ, కిటికీ లోంచి బయటికి చూసి ఉలిక్కిపడ్డాడు.

భయంతో కాదు! అది అతని నిఘంటువులో లేదు!! ఆశ్చర్యంతో!!!

తెల్లటి ధోవతీ, ముతక లాల్చీ, కండువా వేసుకున్న ఒక పెద్ద మనిషి, అతి కష్టం మీద, ప్రయాసతో తన ఇంటికేసి మెట్లెక్కుతూ వస్తున్నాడు. ఆ చిరుచీకట్లో, అంత తెల్లవారు జామున తనింటికి, తన్ను వెతుక్కుంటూ వస్తున్నాడంటే, తప్పకుండా క్లయింట్ అయి ఉంటాడు. ఎందుకోగాని, ఆ ముసలాయన్ని చూస్తే, గుండెలోతుల్లో కలుక్కుమంది విశ్వనాథ్‌కి. ఇంత తెల్లవారు జామున ఇంత హడావిడిగా తనని వెతుక్కుంటూ వచ్చిన ఆ మనిషి ఎవరై ఉంటారబ్బా అని మరోసారి చూసిన విశ్వనాథ్ మరోసారి ఉలిక్కిపడ్డాడు.

మాష్టారు!

గబగబా విస్కీ గ్లాసు పక్కన పెట్టేసి, కళ్లు నులుపుకుని మళ్లీ చూశాడు.

సందేహంలేదు! మాష్టారే!! పరంధామయ్య మాష్టారు!!! ఏనాటి మాష్టారు! ఇంకా సర్వీసులో

ఉన్నారా? రిటైరైనారా??

విశ్వనాథ్‌లోని 'మందు' తన ప్రభావం చూపటం మానేసింది. మళ్లీ 'హేంగ్ ఓవర్' మొదలైంది.

"నో! మాష్టారు కే కష్టమూ రాకూడదు!!"

తన పిచ్చి కానీ, ఏ కష్టమూ రాకపోతే, మాష్టారు ఎందు కొస్తారు ఇక్కడికి? అందులోనూ ఈ సమయంలో??

విశ్వనాథ్ మెదడులో ఆలోచనలు, కందిరీగల తుట్టెను కదిలిస్తే ఉన్నంత గజిబిజిగా ఉన్నాయ్! అంత చలిలో కూడా నుదుటిన స్వేద బిందువులు పేరుకుంటున్నాయ్! అవును మరి! మాష్టా రంటే తనకి దైవంతో సమానం! ఇతరుల తప్పులను సున్నితంగా, సంస్కారవంతంగా దిద్దే వారాయన!! తన కింకా బాగా గుర్తుంది! త నొకసారి తన క్లాస్‌మేట్ పెన్ కాజేశాడు! వాడు వెళ్లి వరంధామయ్య మాష్టారితో చెప్తే, ఏం చేశారాయన!

"అందరూ ఒక్క నిముషం పాటు కళ్లు మూసుకోండ్రా! ఆ పెన్ను తీసిన వాడు మళ్లీ పెన్ను తీసిన చోట పెట్టేస్తాడు! ఒరేయ్! నా విద్యార్థుల్లో దొంగ లుండర్రా! ఎవడో తెలీక చేశా డీ పని! కచ్చితంగా మళ్లీ పెన్ను దొరుకుతుంది చూడండి కావలిస్తే!"

అందరూ కళ్లు మూస్కోగానే, తను పెన్ను తీసినచోట పెట్టేశాడు! మాష్టారు మాటల్లోని మత్తు అది! అంతే!! ఆ రోజు నించీ, ఈ రోజు వరకూ ఆ పెన్ను తనే తీసినట్టు ఎవరికీ తెలీదు. ఎంత సున్నితమైన మందలింపు? ఎంత చక్కటి తీర్పు??

"డింగ్, డింగ్, డాంగ్" - బెల్ మోతతో ఈ లోకంలోకి వచ్చాడు విశ్వనాథ్. టేప్ రికార్డర్ ఆపుచేసి, గడియ తీసిన విశ్వనాథ్ నోట్లోంచి "రండి మాష్టారు" అన్న మాటలు అప్రయత్నంగా వెలువడ్డయ్!

"బాగున్నారా మాష్టారూ?!... ఒరేయ్! రెండు కాఫీ పట్రారా!" మాష్టార్ని పలకరిస్తూనే పని వాడికి పురమాయించాడు విశ్వనాథ్.

"ఆ ఏడు కొండల వాడి దయ వల్ల బాగానే ఉన్నాను బాబూ! అవునూ... నీకు... నువ్వు.... నీకు నే నెలా తెలుసు?"

"నేను మాష్టారూ! విశ్వాన్ని... 'మంచినీళ్ల' విశ్వాన్ని!! గుర్తుపట్టారా?"

"మంచినీళ్ల విశ్వం!"

రోజూ లంచ్ అవర్‌లో మంచినీళ్ల కోసం పంపు దగ్గర పిల్లకాయల్తో గోలగా ఉండేది! తన వల్ల కాదని, విశ్వం రోజూ మంచినీళ్లు తెచ్చిచ్చేవాడు. అప్పట్నించి వాణ్ని అందరూ "మంచినీళ్ల విశ్వం" అనే వారు.

ఆ 'మంచినీళ్ల విశ్వం' ఇప్పు డింత పెద్ద లాయర్ అయ్యాడా?! ఇంత పెద్ద బంగళాలో ఉంటున్నాడా??

"సార్! కాఫీ."

పని వాడి మాటల్తో ఈ లోకంలోకి వచ్చారు మాష్టారు.

"కాఫీ తీసుకోండి మాష్టారూ" త నో కప్పు తీసుకుని మాష్టారికి మరో కప్పు అందిస్తూ అన్నాడు విశ్వనాథ్. "ఇంత పొద్దున్నే వచ్చారేం మాష్టారూ?"

"నువ్వు ఎనిమిది దాటితే ఉండవనీ, రాత్రి పూట అసలు పట్టుకోవటం కష్టమనీ చెప్పారు బాబూ... అందుకని..." మెట్లెక్కి వచ్చిన అలసట మాష్టార్లో ఇంకా తగ్గలేదు.

"నాకు బెయిల్ కావాలి విశ్వం!" వణుకుతున్న గొంతుతో మాష్టారి నోటి వెంట వచ్చిన మాటలకి, విశ్వనాథ్ ఖంగుతిన్నాడు. మాష్టారి వంక చూశాడు. ఆ మొహంలో ఆనాటి అమాయకత్వం, నిజాయితీ ఇంకా అలాగే ఉన్నై. ఇన్నేళ్ల తన ప్రాక్టీస్‌లో వచ్చి హంతకులకీ, రౌడీలకీ - ఇంకా మాట్లాడితే, రేపిస్టులకీ బెయిల్ తీసి ఇచ్చాడు తను. కానీ, మాష్టారి లాంటి వాళ్లు బెయిల్ కోసం రావటం, ఇదే మొదటిసారి!

వరంధామయ్య మాష్టారికి బెయిల్!!!

అంటే - వరంధామయ్య మాష్టారి మీద క్రిమినల్ కంప్లెయింట్!!!... నవ్వొచ్చింది విశ్వానికి. అవునూ - మాష్టారి మీద క్రిమినల్ కేస్ - ఏమి టయ్యుంటుంది? ఎవడు పెట్టి ఉంటాడు?

"భగవాన్! మా మాష్టారి కేం కాకుండా చూడు" - " ఇన్నేళ్ల తన ప్రాక్టీస్‌లో భగవంతుడి సహాయం అర్థించింది ఎప్పుడూ లేదు! ఇదే మొదటిసారి!!

"డింగ్, డింగ్, డాంగ్" డోర్ బెల్ మళ్లీ మోగటంతో విశ్వనాథ్ ఆలోచనలకి బ్రేక్ పడింది.

"కమిన్...."

తలుపు తెరిచే ఉండటంతో, విశ్వనాథ్ మాట పూర్తి కాకుండానే లోపలికి వచ్చేశా డా వ్యక్తి.

"ఏరా! నిన్న నీ కోసం క్లబ్‌లో చాలా సేపు ఎదురుచూశాను. రాలేదేం?"

"వీలు కాలేదు కానీ, ఎవ రొచ్చారో చూడు" మాష్టార్ని చూపిస్తూ అన్నాడు విశ్వనాథ్.

"అరె... మన.... వరంధామయ్య మాష్టారు కదూ."

"అవును - ఆయనే."

"నమస్కారం సార్! నేను గుర్తున్నానా?" ఆ వ్యక్తి మాష్టార్ని పలకరించాడు.

కాఫీ కప్పు టీపాయ్ మీద పెడ్తూ, ఆ వచ్చిన వ్యక్తిని పరికించి చూశారు మాష్టారు!

గుర్తొచ్చిం దాయనకు! మస్తాన్... ఎప్పుడూ మంచినీళ్ల విశ్వంతో కూడా ఉండేవాడు. కాస్త అల్లరి చిల్లరగా రౌడీతనం చేస్తుండేవాడు. ఆనాటి వీళ్ల స్నేహం ఇంకా చెక్కుచెదరలేదన్న మాట!!

"నువ్వు మస్తాన్‌వికి కదూ! ఎస్.ఐ. గారి అబ్బాయివి. మీ నాన్న గా రెలా ఉన్నారోయ్?... భలే స్ట్రిక్ట్‌గా ఉండేవాళ్లే.. ఏం తయినా ఆ రోజులే వేరు... ఇంకా సర్వీసులో ఉన్నారా?"

"లేదు మాష్టారూ! రిటైరైపోయారు...." మస్తాన్ ఇం కేదో చెప్పబోతుండగా గోడ గడియారం లోంచి మ్యూజిక్ వినిపించింది.

ముగ్గురూ అప్రయత్నంగా గడియారం కేసి చూశారు. ఏడైంది!

"ఒరేయ్ మస్తాన్! నా ఆఫీసుకు వెళ్లే టయమవుతోంది గానీ, ను వ్వెళ్లి ఆ పక్క గదిలో కూర్చో! మాష్టారితో మాట్లాడాలి."

"ఉండనీ విశ్వం! మస్తాన్ పరాయి వాడేం కాదు..." విశ్వనాథ మాటల్ని మధ్యలోనే ఆపేస్తూ అన్నారు మాష్టారు.

"సరే చెప్పండి మాష్టారూ!... ఒరేయ్ రంగా! మరో మూడు కప్పుల స్ట్రాంగ్ కాఫీ పట్రారా!" విశ్వం అన్నాడు.


విశ్వనాథ్‌కి కొంచెం అసహనంగా ఉంది. తనకి రొటీన్‌గా పడే "హాంగోవర్ పెగ్" పడలేదు. పైగా

## 'సృష్టి'



మందిరంలో 'పూజారి' సుప్రభాతానికి పూనుకోలేదు...
మసీదులో 'ఇమాము' అజాకు సిద్ధం కాలేదు...
చర్చిలో 'ఫాదర్' ఇంకా ప్రసంగానికి సమాయత్తం కాలేదు...
'హలాల' పేరుతో కసాయి వీధిలో 'ఘోరం' జరిగిపోతోంది...
చంద్రుడు భయకంపితుడై త్వరత్వరగా పారిపోతున్నాడు...
భాస్కరుడు భువి పైకి రావడానికి సంశయిస్తూనే ఉన్నాడు...!!

షేక్‌పీరాన్



తన కిష్టమైన రెండు పాట లింకా వినలేదు.

"మేరేనైనా సావన్ భాదో."

"హమే తుమ్‌సె ప్యార్ కిత్‌నా..."

ఎంత చక్కటి పాటలు అవి. ఓ పెగ్గు నైస్‌గా "ఆన్ ది రాక్స్" చప్పరిస్తూ ఆ పాటలు వింటుంటే...

"సార్! కాఫీ."

ఆలోచనల్లోంచి తేరుకుని కాఫీ తీసుకున్నాడు విశ్వనాథ్. మాష్టారు, మస్తాన్ కూడా చెరో కప్పు అందుకున్నారు.

"ఇప్పుడు చెప్పండి మాష్టారూ!" వేడి వేడి కాఫీ సిప్ చేస్తూ అన్నాడు విశ్వనాథ్. "ఏమి టా సమస్య?"

"నాకు ముగ్గు రమ్మాయిలు! నీకు తెలుసుగా బాబూ! అప్పుడు నువ్వు చదువుకునే రోజుల్లో చిన్నపిల్లలు! అందులో పెద్దమ్మాయి పెళ్లి చేశాను బాబూ! మిగతా ఇద్దరూ చదువుకుంటున్నారు."

కప్పులోని కాఫీ గడాగడా తాగేసి మళ్లీ చెప్పసాగారు మాష్టారు! ఆయన గొంతులో 'భయం' స్పష్టంగా తెలుస్తోంది.

"ఇప్పు డొచ్చిన సమస్య మా పెద్దల్లుడితోనే బాబూ! లక్షణమైన గవర్నమెంటుద్యోగం మానుకున్నాడు. ఎప్పుడూ తాగి చిల్లరమల్లర వెధవల్తో తిరుగుతుంటాడు. డబ్బు కోసం నన్ను వేధిస్తుంటాడు..."

"అమ్మాయిని బాగా చూసుకుంటాడా?" మాష్టారి మాటలకి అడ్డొస్తూ అడిగాడు విశ్వనాథ్. అతడిలోని 'లాయర్' అలర్ట్ అయిపోయాడు.

"అదొక్కటే మా అదృష్టం బాబూ! ఇంతవరకూ అమ్మాయిని బాగానే చూసుకుంటున్నాడు. నన్నే... వేధిస్తాడు డబ్బు కోసం..."

"ఊ" ... తల పంకిస్తూ అన్నాడు విశ్వం. "కొంత వరకూ నయమే."

"ఈ మధ్య నో అర్ధరాత్రి వేళప్పుడు తప్పతాగి, ఇద్దరు మనుమల్నేసుకుని ఇంటి కొచ్చాడు బాబూ! ఊరికే వాకిట్లో నిలబడి ఏదేదో అరుస్తుంటే, బాగుండదని, లోపలికి పిలిచి కూర్చోపెట్టాను - అర్జంటుగా ఓ పాతిక వేలు కావాలనీ, లేకపోతే త నివ్వవలసిన వాళ్లు తంతారనీ అన్నాడు."

"తన్న నివ్వాల్సింది..." మస్తాన్ ఇం కేదో అనబోతుండగా, విశ్వం అడ్డుకున్నాడు. "మీరు చెప్పండి మాష్టారూ!"

"నా దగ్గరంత డబ్బు లే దన్నాను. పోనీ ఓ ప్రోనోటు తన పేర రాసివ్వమనీ, అది వాళ్లకి చూపించి ప్రస్తుతా నికి తప్పించుకుంటాననీ...."

"రాసిచ్చేశారా!?..." మస్తాన్‌కి బి.పి. పెరిగి పోతోంది.

"రాసిచ్చే ఉంటారు. లేకపోతే మన దగ్గరి కెందుకొస్తారు? ఆ తరవాత కథ నేను చెప్తాను మాష్టారూ! మరికొన్నాళ్లకి వచ్చి - త నివ్వవలసిన వాళ్లకి చూపించాలని - ఒకటో, రెండో పోస్ట్ డేటెడ్ చెక్స్ తీస్కెళ్లి ఉంటాడు మీ దగ్గర... అంతేనా మాష్టారూ?"

"చూసినట్టు చెపుతున్నావ్! నీ కెలా తెల్సు బాబూ..."

"అంతేకాదు..... ఇంకా చెప్పమంటారా!? వాడు.. సారీ.. మీ అల్లుడు గారు.. ఆ చెక్స్‌ని బ్యాంక్‌లో ప్రెజెంట్ చేసి, అవి చెల్లకపోతే మీ మీద పోలీస్ కేస్ పెట్టాడు! ఆ సందర్భంగా మీరు బెయిల్ కోసం వచ్చారు! అంతేకదూ!!"

"అంతే బాబూ" అటూ, ఇటూ పచార్లు చేస్తూ మాట్లాడుతున్న "మంచినీళ్ల విశ్వాన్ని" విస్మయంగా చూస్తూ అన్నారు పరంధామయ్య గారు.

"మాష్టారూ! ఇప్పుడు రెండే రెండు మార్గాలు మన ముందున్నాయ్! నంబర్ వన్ - రాజీ, నంబర్ టూ - కేసు. రెండో దానికంటే మొదటిది - అంటే రాజీ అన్ని విధాలా క్షేమకరం" చెప్పటం ముగించి "ఏమంటారు?" అన్నట్టుగా చూశాడు విశ్వం.

"ఆ ప్రయత్నమూ అయిపోయింది బాబూ! కాళ్లా వేళ్లా పడ్డా వినిపించుకోలేదు. ఉన్నపళంగా పాతిక వేలు పోసే శక్తి నాలో లేదు. నెల కింత అంటే ఒప్పుకోడు..."

"వాడి బాబుని కూడా ఒప్పిస్తాం...." విశ్వనాథ్‌ని చూసి ఆగిపోయాడు మస్తాన్!



"ఇం కో మూడేళ్ల సర్వీసుంది. రిటైరయ్యాక ఇచ్చేస్తాను. అప్పటికీ - ఇంకా ఇద్దరాడపిల్ల లుంటారు.." చెప్పటం అయిపోయిం దన్నట్లుగా చూసి - కండువాతో చెమట తుడుచుకున్నారు మాష్టారు.

మ్యూజికల్ వాల్ క్లాక్ మళ్లీ మోగటంతో ముగ్గురూ కొంచెం కదిలారు. టయి మయిపోతోందే అన్నట్టుగా.

"మాష్టారూ! పోనీ, మీ కభ్యంతరం లేకపోతే, ఆ పాతిక వేలూ నేను సర్దుబాటు చేస్తాను. మీ అల్లుడి కిచ్చేయండి.. అహ... మీ కభ్యంతరం లేకపోతేనే!!" మాష్టారి వ్యక్తిత్వం తెలిసిన విశ్వనాథ్‌కి, అంతకంటె గట్టిగా చెప్పే ధైర్యం లేకపోయింది. అందుకే మాష్టారు ఒప్పుకోరని తెలిసినా తన ప్రయత్నంగా అన్నాడు.

"వద్దు బాబూ! ఈ ముసలి ప్రాణం ఎప్పుడు 'హరీ' మంటుందో తెలీదు... నా భారం నీ మీదకి నెట్టటం సభ్యత కూడా కాదు. కాకపోతే ఫీజు లేకుండా ఈ కేసు చేసిపెట్టు. అదే పదివేలూ - పాతిక వేలూ నాకు.... నీ ఋణం..."

"మాష్టారూ!" సోఫాలోంచి ఒక్క ఉదుటున లేచి వెళ్లి మాష్టారి చేతులు పట్టుకున్నాడు విశ్వనాథ్. "అంత మా టనకండి - నా ప్రయత్నం చేస్తాను - కాకపోతే, ఈ చెక్ చెల్లకపోవటం కేసుల్లో శిక్షలు కూడా వేస్తున్నా రీ మధ్య" చివరి మాటలు కాస్త గొణుగుతున్నట్టుగా అన్నాడు విశ్వం.

"మరి నే వెళ్లిరానా బాబూ!" లేచి నుంచుంటూ అన్నారు మాష్టారు.

"ఉండండి మాష్టారూ" మాష్టార్ని చేత్తోనే వారించి పని వాడితో అన్నాడు విశ్వం. "ఒరేయ్! రంగా! మన డ్రైవర్ని పిల్చి - మాష్టార్ని ఇంటి దగ్గర దిగబెట్టి రమ్మను."

"బాబూ - అనవసరంగా..."

"ఈ విషయంలో నన్ను చిన్నబుచ్చకండి మాష్టారూ!" ఇక మాష్టార్ని మాట్లాడనివ్వ దల్చుకోలేదు విశ్వం.

"రేపు ఉదయం తొమ్మిదిన్నర కంతా కారు మీ ఇంటి కొస్తుంది మాష్టారూ! - కోర్టుకి మీరు నాతో పాటే వస్తారు."

మాష్టారు వెళ్లిపోయారు.

"ఒరేయ్ మస్తాన్! అర్జంటుగా చెరో పెగ్గూ సర్వ్ చెయ్యరా! అలాగే ఆ టేప్ కూడా ఆన్ చెయ్యి!... చూడు... నాకు మాత్రం "ఆన్ ది రాక్స్." గబగబా అన్నాడు విశ్వం.

మస్తాన్ టేప్ ఆన్ చేశాడు. "మేరే నైనా సావన్ - భాదో"... "మహబూబా"లోని పాట సన్నగా వినిపిస్తోంది.

"ఆ దొంగ నాయాలగాడ్ని లేపేస్తే ఎలా ఉంటుందిరా?" విశ్వానికి గ్లాస్ అందిస్తూ అన్నాడు మస్తాన్. అంతకంటే తక్కువ లెవల్లో ఆలోచించటం అతనికి చేతకాదు.

"ఎవర్నిరా?"

"అదేరా! మన మాష్టారి మీద కేసు పెట్టినవాడ్ని."

"ఒరేయ్! వాడు మన మాష్టారు గారి అల్లుడురా! కూతురి మొగుడు - ఆ ఒక్క అర్హత చాలు - వాడు బతికుండటానికి - ఇదే మరొకడూ, మరొకడూ అయితే - ఈ విశ్వం 'విశ్వరూపాన్ని' ప్రదర్శించి ఉండేవాడు కోర్టు లోపలా - బయటా కూడా."

"అది సరే గానీ, నా కే సేమయిందిరా." త నొచ్చిన పనిని గుర్తు చేశాడు మస్తాన్!

"నువ్వు సాక్షులని మానేజ్ చేసుకో! మిగతా కథ నేను నడిపిస్తాను... నువ్వు శాల్తీలు' గల్లంతు చెయ్యటం - నేను నిన్ను కాపాడటం - ఎన్నోసారిరా ఇది?"

తన కిష్టమైన రెండూ పాటలూ అయిపోవటంతో టేప్ ఆపు చేశాడు విశ్వనాథ్.

మ్యూజికల్ వాల్‌క్లాక్ మళ్లీ మ్రోగింది. తొమ్మిది అయిం దన్నట్లుగా!

"ఒరేయ్ మస్తాన్! కారు రెడీ చెయ్యమని చెప్పరా! నేను అయిదు నిముషాల్లో స్నానం చేసి వస్తాను - బ్రేక్‌ఫాస్ట్ అక్కడే హొటల్ "బసేరా"లో లాగించేద్దాం." మస్తాన్ని పురమాయించి ఇంట్లోకి

వెళ్లాడు విశ్వనాథ్.

*** *** ***

దాదాపు రెండున్నర సంవత్సరాల తరువాత....

సికిందరాబాదు కోర్టు కాంపౌండ్‌లో - మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గారి కోర్టు హాల్లో -

వెలసిపోయిన గోడలూ, చేతులు విరిగిన కుర్చీలూ, నడుములు విరిగిన బెంచీలూ, తిరగని ఫ్యాన్లూ, తిరిగే జనాలూ.... "అసలిక్కడ నిజంగా న్యాయం జరుగుతుందా" అనిపించే ఓ విధమైన పిచ్చి వాతావరణం సాక్షిగా...

మాష్టారి కేసూ, మస్తాన్ కేసూ జడ్జిమెంటు కొచ్చినై.

"మస్తాన్ అనబడే ముద్దాయి మీద మోపబడిన హత్యానేరం, ప్రాసిక్యూషన్ వారు తగు సాక్ష్యాధారాలతో రుజువు చెయ్యలేకపోయిన కారణంగా... ముద్దాయిని నిర్దోషిగా తీర్పునిస్తూ, కేసు కొట్టివేయటమైనది."

కళ్లలో విజయగర్వం తొణికిసలాడుతుండగా, సాక్షుల బాక్స్‌లోంచి వస్తూనే విశ్వనాథ్‌ని ఆలింగనం చేసుకున్నాడు మస్తాన్.

ఇక మాష్టారి కేసులో -

"బాధ్యత గల ఉపాధ్యాయుడై ఉండీ, ఖాతాలో తగు సొమ్ము లేకుండా చెక్కు లిచ్చి మోసానికి పాల్పడ్డా రన్న అభియోగాన్ని ప్రాసిక్యూషన్ వారు తగు సాక్ష్యాధారాలతో నిరూపించిన కారణంగా - పరంధామయ్య అనబడే ఈ ముద్దాయికి ఐదు వందల రూపాయల జరిమానా, మరియు మూడు నెలల సాధారణ ఖైదు విధించడమైనది.."

ఎన్నో అబద్ధపు కేసుల్ని కోర్టులో గెల్చిన విశ్వనాథ్, ఒక 'నిజమైన నిజాన్ని' కోర్టులో నిరూపించలేకపోయిన క్షణ మది! ఎందరో హంతకుల్ని కాపాడిన లాయర్ విశ్వనాథ్, ఒక అమాయకుడిని కాపాడలేకపోయిన దురదృష్టకరమైన ఘడియ అది!

ఇద్దరు కానిస్టేబుళ్లు మాష్టారి వైపు అడుగులేస్తున్నారు, వాళ్ల డ్యూటీలో భాగంగా!!

ఇదంతా చూస్తున్న మస్తాన్ ఇంక ఉండబట్టలేక బరస్ట్ అయ్యాడు.

"థూ నీయమ్మ!! ఈ దేశాన్ని ఎవడూ కాపాడలేడ్రా!! నే నారోజే చెప్పాను - "నాయాలగాడ్ని లేపేద్దాంరా" అని - విన్లేదురా నువ్వు - "మాష్టారు గారి అల్లుడు", "గాడిద గుడ్డు" అని నన్ను అదుపు చేశావ్. చూడ్రా ఇప్పు డేమయిందో..."

తన చొక్కా పట్టుకుని ఊపేస్తూ పొంతనలేకుండా మాట్లాడుతున్న మస్తాన్ కళ్లల్లోకి చూశాడు విశ్వనాథ్.

మస్తాన్ ఏడుస్తున్నాడు.

చలించిపోయాడు విశ్వనాథ్.

ఇహ ఉండబట్టలేకపోయాడు.

"ఒరేయ్ దేవుడూ! పూర్తిగా నీ మీద భారం వేసి న్యాయాన్ని బ్రతికించమని కోరుకున్న మొట్టమొదటి కేసురా ఇది!! అదీ - నా మామూలు పద్ధతిలో గనకపోయి ఉంటే - మా మాష్టారి మీద ఈగ కూడా వాలనిచ్చే వాడ్ని కాదురా! దుర్మార్గుడా!!"

గుండె గొంతుకలోన కొట్టాడుతుండగా - నిశ్శబ్దంగా రోదించాడు విశ్వనాథ్!! 'వన్ ఆఫ్ ది బెస్ట్ లాయర్స్ ఆఫ్ ఏ.పీ.'

*** *** ***

ఇక - మాష్టా రింట్లో -

పిల్ల లిద్దర్నీ కాలేజీలకి పంపించి తన భర్త కేమీ అవ కారం తలపెట్టొద్దని అర్థిస్తూ - మడికట్టుకుని మరీ పూజ కుపక్రమించింది మాష్టారి భార్య!!

".... కలియుగే, ప్రథమ పాదే, జంబూ ద్వీపే, భరతవర్షే, భరత ఖండే...."


# సంక్రాంతి శుభాకాంక్షలతో

అందమే ఆభరణంగా భావించే అతివలకు ముఖంపైన, శరీరంపైన గల అనవసరమైన వెంట్రుకల బారినుండి విముక్తి పొందడం తరతరాల నుండి తీరని సమస్యగానే ఉండిపోయింది.... కాని....

ఇక మాత్రం కాదు

అనూస్ ఎలక్ట్రాలిసిస్ ఒక త్వరితమైన, సురక్షితమైన, సమర్థవంతమైన శాశ్వత పరిష్కారాన్ని అందిస్తోంది!

అనూస్ ఎలక్ట్రాలిసిస్ అత్యంత అధునాతనమైన ఇన్‌స్టాంట్రాన్ అమెరికా వారి కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందినది.

అనూస్ ఎలక్ట్రాలిసిస్‌లో 100 శాతం సురక్షితమైన నొప్పి కలిగించని నవీనమైన ఐ.బి. ప్రోబింగ్ (I.B. Probing) పద్ధతినే అనుసరిస్తారు.

అనూస్ లోని ప్రత్యేక శిక్షణ పొందిన ఎలక్ట్రాలిజిస్టులు ప్రతి స్త్రీ చర్మ లక్షణాలను క్షుణ్ణంగా పరిశీలించి, పరీక్షించి ప్రత్యేకమైన అభిమానంతో మీ సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తారు.

అనూస్ ఎలక్ట్రాలసిస్‌లో వెంట్రుకలను పీకివేయటం లేదా వివిధ రకాల లోషన్లు మందులు ఉపయోగించరు.



అత్యంత సమర్థవంతమైన ఎలెక్ట్రానిక్ పరికరాలతో వెంట్రుకలను మూలధాతువుతో సహా తొలగిస్తారు.

అనూస్ ఎలక్ట్రాలిసిస్ చర్మ కణాలకు ఏమాత్రం హాని కలిగించదు లేదా మచ్చలను ఏర్పరచదు. అనవసరమైన వెంట్రుకలను తొలగించి, కొత్త వెంట్రుకలు రాకుండా చేస్తుంది.

అనూస్ ఎలక్ట్రాలిసిస్ దీర్ఘ కాలికంగా ఆలోచిస్తే వీటన్నింటికి మించి ఖర్చువరంగా ఎంతో ఆదా అయిన, సరసమైన విధానం.

వివిధ రకాల చర్మ సంరక్షక పద్ధతులకు, అందానికి అవసరమైన ఉచిత సలహాలకు ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు సంప్రదించండి.

Anoo's
Electrolysis & Skin Care Unit

3, గ్రౌండ్ ఫ్లోర్, లింగాపూర్ లాబిల్డే, అమృతా ఎస్టేట్స్, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29. Ph. 243999

మీ అందం - తరిగిపోని మీ ఆభరణం

Niha/23192